# సంక్షేమంలో తెలంగాణ నంబర్ వన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడటౌన్, నవంబర్ 1 : దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమం అమలు చేస్తూ నంబర్ వన్‌గా నిలిచామని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. పట్టణంలో నియోజకవర్గ సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల వేళ అభివృద్ధిని సైతం అవహేళన చేస్తూ ప్రతిపక్ష పార్టీలు పబ్బం గడుపుకుంటున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పాలిత ప్రభుత్వాలు ఏం అభివృద్ధి చేశాయో ప్రజలకు చెప్పలేని స్థితిలో ఇక్కడి నాయకులు ఉన్నారన్నారు. సీఎం కేసీఆర్ పాలనే రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు. రాష్ట్రంతో పాటు కోదాడ నియోజకవర్గంలో మళ్లీ గులాబీ జెండా ఎగురుతుందన్నారు. సమావేశంలో ఎంపీపీ చింతా కవితారెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు సుంకర అజయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షులు పల్లా నర్సిరెడ్డి, తొగరు రమేశ్, కాపాని వెంకటేశ్వర్లు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

### మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

కోదాడ టౌన్ : మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మైనార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో రాజకీయ పార్టీలు మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకు గానే వాడుకొని వారి సంక్షేమాన్ని గాలికి వదిలేశాయని విమర్శించారు. ప్రస్తుతం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారిని అన్ని రకాలుగా ఆదుకుంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ముస్లిం నాయకులు వచ్చే ఎన్నికలో మైనార్టీల మద్దతు బీఆర్ఎస్‌కేనని, కో దాడలో బొల్లం మల్లయ్యయాదవ్‌ను అధిక మెజార్టీతో గెలిపిస్తామని తీర్మానం చేశారు. అనంతరం పండ్ల వ్యాపారస్తులు ఎమ్మెల్యేను కలిసి తమ పూర్తి మద్దతు తెలిపారు. సమావేశంలో కోదాడ ఎంపీపీ చింతా కవితారెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు నయీమ్, గ్రంథాలయ చైర్మన్ రహీం, అబ్బూ, నిజాం, ముస్తాఫా, బషీర్, శేషు, అరుణ, సలీమా, గౌసియా, మజహర్, నాగుల్ పాల్గొన్నారు.

### బీసీ సంఘం మండలాధ్యక్షుడు బీఆర్ఎస్‌లో చేరిక

మునగాల : ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ సమక్షంలో బీసీ సంఘం మండలాధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం నాయకుడు చింతకాయల నాగరాజు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో ఉంటూ లబ్ధి పొందిన మండల నాయకులు ఎన్నికల సమయంలో పార్టీ మారారని, అలాంటి అవకాశవాద నాయకులకు బుద్ధి చెప్పేలా విధంగా ప్రజలు తీర్పు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు సుంకర అజయ్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు తొగరు రమేశ్, సర్పంచ్ చింతకాయల ఉపేందర్, ఉప సర్పంచ్ ఎల్.వెంకయ్య, తుపాకుల భాస్కర్, నాగబాబు, రామయ్య, సత్యం, గురుమూర్తి పాల్గొన్నారు.



విలేకరుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

## సీఎం సభను విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు

- *ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి*

హుజూర్‌నగర్, నవంబర్ 1 : హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేసిన ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ సభకు నియోజవర్గవ్యాప్తంగా లక్షలాది మంది తరలివచ్చి విజయవంతం చేసినందుకు పార్టీ కార్యకర్తలు, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల, నియోజవర్గంలో ఇండస్ట్రీయల్ పార్కు, యువల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుపై సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీఎం కేసీఆర్ కృతజ్ఞత సభలో నియోజకవర్గానికి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. రైతుబంధు పథకంతో డబ్బును వృథా చేస్తున్నారని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పడం కాంగ్రెస్ పార్టీ పనితీరుకు అద్దం పడుతుందని విమర్శించారు. 5గంటల కరెంటు ఇచ్చే కాంగ్రెస్ కావాలా, 24 గంటల విద్యుత్ అందిస్తున్న బీఆర్ఎస్ కావాలా అనేది ప్రజలకు సృష్టంగా అర్థమైందన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పేదలకు మరింత మేలు చేసేలా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు రాష్ట్రంలో హత్యా రాజకీయాలకు తెర లేపారన్నారు. బీఆర్ఎస్ నాయకుడు కొత్త ప్రభాకర్‌పై జరిగిన దాడిని ఖండించారు. ఇలాంటి దాడులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నబీ, మఠ్రిగూడెం సర్పంచ్ సైదులు, నాయకులు పచ్చిపాల ఉపేందర్ , సోమగాని ప్రదీప్, కీత ధనమూర్తి పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

హుజూర్‌నగర్ నియోజవర్గంలోని కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే సైదిరెడ్డి హామీనిచ్చారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌కేవీ నియోజకవర్గ అధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్ ఆధ్వర్యంలో హమాలీ యూనియన్ నాయకులతో సమావేశమయ్యారు.

# మూడో కాన్వకేషన్‌కు ఎంజీయూ సిద్ధం

- ఈ నెల 8న నిర్వహించేందుకు నిర్ణయం
- ఎంజీయూ వెబ్‌సైట్‌ల్లో టాపర్స్ లిస్ట్
- ఉమ్మడి జిల్లాలోని 40 మందికి బంగారు పతకాలు, 17 మందికి పీహెచ్‌డీలు




ఎంజీ యూనివర్సిటీ

రామగిరి, నవంబర్ 1: నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ తృతీయ కాన్వకేషన్(స్నాతకోత్సవం)కు అధికారులు తేదీ ఖరారు చేశారు. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి సూచన మేరకు ఈ నెల 8న కాన్వకేషన్ నిర్వహణకు వర్సిటీ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో వివిధ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను, టాపర్స్‌కు బంగారు పతకాలను అందించనున్నారు.

మహాత్మాగాంధీ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులకు ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్ (ఓడీ) అందించేందుకు తృతీయ కాన్వకేషన్ నిర్వహించాలని వర్సిటీ వీసీ సీహెచ్. గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు నిర్ణయించారు. ఆ దిశాగా వర్సిటీ పరీక్ష విభాగం అధికారులు కాన్వకేషన్‌కు అవసరమైన అంతర్గత పనులు పూర్తి చేస్తున్నారు. ఈ నెల 8న ఎంజీయూ ప్రధాన క్యాంపస్‌లో కాన్వకేషన్(స్నాతకోత్సవం) నిర్వహించి పట్టాలు అందించనున్నారు. యూనివర్సిటీ స్థాయిలో వివిధ కోర్సుల్లో టాపర్స్‌గా నిలిచిన 40 మందికి బంగారు పతకాలు, పీహెచ్‌డీ పూర్తి చేసిన 17 మందికి డాక్టరేట్‌లు అందించనున్నారు.

### ఎంజీయూ వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

యూనివర్సిటీ నిర్వహించే తృతీయ స్నాతకోత్సవానికి సంబంధించి బంగారు పతకాలు అందుకునే విద్యార్థుల వివరాలతోపాటు, వివిధ కోర్సుల్లో 2018–19 నుంచి 2020–21 విద్యా సంవత్సరం వరకు ఉమ్మడి జిల్లాలో వివిధ కాలేజీల్లో చదివి యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచి మెరిట్ సర్టిఫికెట్లు అందుకునే 40 మందికి బంగారు పతాకలు, 2023 అక్టోబర్ వరకు పీహెచ్‌డీ పూర్తి చేసిన 17 మందికి పట్టాలు అందుకునే వారి జాబితాను ఎంజీయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. వీరికి గవర్నర్ చేతులమీదుగా పట్టాలు అందించనున్నారు.

### హాజరుకానున్న గవర్నర్

ఎంజీయూలో ఈనెల 8 జరిగే తృతీయ కాన్వకేషన్‌కు ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ తామిళిసై సౌందర్యరాజన్ హాజరవుతారు. ముఖ్యవక్తగా ఓయూ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎస్. రామచంద్రం, ఎంజీయూ వీసీ సీహెచ్. గోపాల్‌రెడ్డి పాల్గొననున్నారు.

### కాన్వకేషన్‌కు ఏర్పాట్లు పూర్తి చేశాం



ఎంజీయూ వీసీ తృతీయ కాన్వకేషన్ నిర్వహించి విద్యార్థులకు పట్టాలను అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ నెల 8న ఎంజీయూ ప్రధాన క్యాంపస్‌లో కాన్వకేషన్ నిర్వహించనున్నాం. 2018 నుంచి 2021వరకు యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, 2023 అక్టోబర్ వరకు పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి డాక్టరేట్ పట్టాలను గవర్నర్ చేతులమీదుగా అందిస్తాం.

–ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, ఎంజీయూ వీసీ



పాలకవీడు : పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న నంద్యాల భూపాల్‌రెడ్డి

## పలువురికి ఓయూ డాక్టరేట్

పాలకవీడు, నవంబర్ 1 : మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన నంద్యాల భూపాల్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి రాజనీతి శాస్త్రంలో డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. ఎలక్టోరల్ ప్రాసెస్ ఇన్ ఇండియా, ఏ కేస్ స్టడీ, నల్లగొండ డిస్ట్రిక్ట్, 1999 ఎలెవంత్ లెజిస్లేటివ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై ఓయూ ఆచార్యులు కొమ్మెర తిరుపతి రెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. భూపాల్‌రెడ్డి ప్రస్తుతం టీశాట్ నెట్‌వర్క్ చానల్‌లో ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్‌గా పనిచేస్తున్నాడు.

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల ఆదర్శ పాఠశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడు ధరావత్ రవీందర్‌నాయక్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఫిజిక్స్ విభాగంలో డాక్టరేట్ అందుకున్నాడు. రవీందర్‌నాయక్‌ను బుధవారం ఎంఈఓ పి.చత్రునాయక్ అభినందించారు. హెచ్ఎంలు నట్టె శ్రీనివాస్‌రావు, సత్యనారాయణరెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు రవికుమార్, డాక్యు, బాలు, అనిత, పాటలీ, వీరబాబు అభినందనలు తెలిపారు.

నడిగూడెం : నడిగూడెం ప్రభుత్వ కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు కొల్లు శ్రీనివాస్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పురస్కారం అందుకున్నారు. ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగంలో సూర్యాపేట, భువనగిరి మున్సిపాలిటీల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై పరిశోధనకు గాను డాక్టరేట్ అందుకున్నట్లు తెలిపారు.

బొడ్రాయిబజార్ : జిల్లా కేంద్రానికి చెందిన పెద్దపంగు అరుణ్ జంజాల్ సామాజిక శాస్త్ర విభాగంలో, మేరీ గోమేదిక సంభావ్య యాంటీ ప్రొలిపెరేటీవ్ ఏజెంట్లుగా టెట్రా హైడ్రో బెంజోసైక్లోహెప్టెనోస్ నుంచి కొత్త టెంప్లేట్ల అంశంపై చేసిన పరిశోధనకు గాను ఓయూ నుంచి డాక్టరేట్ పురస్కారాలు పొందారు. ఇరువురికి పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

మద్దిరాల : కర్విరాల కొత్తగూడెం గ్రామానికి చెందిన మెంతబోయిన సైదులు తెలుగు విభాగంలో ఓయూ డాక్టరేట్ అందుకున్నాడు. నల్లగొండ జిల్లా నవలా సాహిత్యం ఒక పరిశీలన అనే అంశంపై డాక్టర్ దాశరధుల నర్సయ్య పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను అవార్డ్ వరించింది.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

మునగాల : మండల కేంద్రంతో పాటు మండలంలోని గణపవరం, తిమ్మారెడ్డిగూడెం, కొక్కిరేణి, పోలింగ్ కేంద్రాలను మండల ప్రత్యేకాధికారి శ్రీరాములు, ఆకుపాముల, ముకుందాపురం, బరాఖత్‌గూడెం గ్రామాలను తాసీల్దార్ ఆంజనేయులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా ముందస్తు చర్యలు చేపట్టి అన్ని వసతులు కల్పించాలని కోరారు.

### నారాయణగూడెంలో పోలీసుల కవాతు

మునగాల, నవంబర్ 1 : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని డీఎస్పీ ప్రకాశ్ కోరారు. మండలంలోని నారాయణగూడెంలో ఐటీబీపీ బలగాలతో పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగా పోలీసుల కవాతు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ వీరరాఘువులు, ఎస్ఐ లోకేశ్, 32 మంది ఐటీబీపీ సిబ్బంది పాల్గొన్నారు.



నారాయణగూడెంలో కవాతు చేస్తున్న పోలీసులు